

# 'అదే' కథలు

## – ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని 'దేశీ'లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం 'య' అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకి, బాధలకి, దుఃఖాలకి నా బాధ్యత లేదు.

## సహధర్మచారిణి

**ఉద్యోగంలో** చేరాక ఏడాదికి ఇల్లు కొన్నాడు మూర్తి. ఆ తర్వాత మూడు నెలలక్కాబోలు ప్రసాద్ పలకరించాడు ఫోను మీద. తాను ఏదో కాన్ఫరెన్స్ కి సింసినాటీ వస్తున్నాట్ట. ఆ కాఫరెన్స్ వాళ్ళే తిండీ, హోటల్లో గూడూ చూసుకుంటారు. కానీ ఓ సాయంత్రం స్నేహితుణ్ణి కలుసుకోవడం కుదురుతుందా అని అడిగేడు.

చదువుకునే రోజుల్లో తనతోపాటు ఒకే అపార్ట్ మెంట్ లో ఉన్న ప్రసాద్ ని కలుసుకోవడానికి ఎందుకు కుదరదూ? తప్పకుండా కుదురుతుందని చెప్పాక ప్రసాద్ వచ్చేరోజుకి తాను శెలవు పెట్టడానికి నిశ్చయం అయింది.

ప్రసాద్ ఊర్లోకొచ్చాక అతనుండే హొటల్ కెళ్ళి ఇంటికి తీసుకొచ్చేడు మూర్తి ఆదివారం మధ్యాహ్నం లంచ్ కి. పరిచయాలయ్యేక కబుర్లూ, భోజనం. ప్రసాద్ మాటల్లో అడిగేడు మూర్తిని, "చదువుకునే రోజుల్లో అస్తమానూ ఏదో ఒక మంచి గ్రాండ్ చెరోకీ అనే జీపులాంటి కారు కొనాలి అనేవారుగా ఇప్పుడీ ఫోర్డ్ కారు కొన్నారేం?"

"ఆ పరిస్థితుల్లో అలా అనిపించేది. ఇప్పుడీ ఇల్లూ అదీ కొన్నాక బడ్జెట్ చూసుకుంటే నేను కొనగలిగేది ఫోర్డ్ ఒకటే తేలింది. ఏం చేస్తాం? మరో కొన్నాళ్ళకి చూద్దాం లెండి, ఏమో సుమిత్ర ఇప్పుడు చదివే ఎమ్ ఎస్ అయిపోయి మంచి ఉద్యోగం లో చేరితే చూడొచ్చు."

ఇదంతా వింటున్న సుమిత్ర చురచురా చూడ్డం మూర్తి చూడలేదు గానీ, ప్రసాద్ కి మాత్రం కంటి చివరనుంచి కనిపించింది. పెళ్లయ్యాక మూర్తి బాగా మారాడు అనిపించింది ప్రసాద్ కి ఎందుకో.

ఊర్లోకి వచ్చిన తెలుగు సినిమాకి బయల్దేరదీసాడు మూర్తి భోజనం అయ్యేక. సరే అమ్మగారు బయల్దేరేసరికి కాస్త టైమ్ పడుతుంది కనక మిత్రులిద్దరూ కబుర్లలో పడ్డారు. ఈ లోపున అమ్మగారినుంచి ఆర్డర్ మూర్తికి. మూర్తి బెడ్రూం లోకి దూరేడు ఆవిడతో మాట్లాడ్డానికి.

ఆ తర్వాత మూర్తి ఆఫీసుగదిలోకి వెళ్ళి ఏదో పనిలో పడేసరికి ప్రసాద్ కూడా అతని వెనకనే వెళ్ళాడు. మూర్తి సుమిత్ర బట్టలు ఇస్త్రీ చేయడం కనిపించింది. ప్రసాద్ మొహంలో చిరునవ్వు. ఎందుకో ఒక్కసారి తాము స్టూడెంట్ జీవితంలో మాట్లాడుకున్నది గుర్తొచ్చింది. అప్పుడేమైందంటే...

కబుర్లలో ప్రసాద్ చెప్పేడు ఓ రోజు కుర్రాళ్ళకి ఏ హోమ్ వర్క్ అదీ లేనప్పుడు టివి చూస్తుంటే, "వినవోయ్ మూర్తీ ముళ్ళపూడి వారి జోకు, ఓ పెద్దాయన కంచం కడుగుతున్నాట్ట ఇంట్లో. ఆయన స్నేహితుడు చూసి అడిగేడు, 'ఇదేమిటోయ్, ఇదెప్పట్నుంచి నీ కంచం నువ్వే కడగడం?' స్నేహితుడు చెప్పేట్ట, 'అబ్బే ఎన్నడూ లేదు.' ఈయన మరోసారి ఆశ్చర్యంగా అడిగేడు, "ఎందుకులేదు, నా కళ్లతో నేను చూస్తే?' దానికి స్నేహితుడి సమాధానం మరింత ఆశ్చర్యం – 'అది మా ఆవిడ కంచం, నాది కాదు.' నవ్వులు.

మూర్తి అన్నాడు, "నేనైతే అలా ఎన్నటికీ చేయను. అసలు మా ఆవిడ ఉద్యోగం చేయడమే నేను ఒప్పుకోను కూడా. ఆవిడ ఇల్లు చక్కపెడుతుంది నేను ఉద్యోగం చేస్తా."

ప్రసాద్ అన్నాడు, "మరీ అంత అన్యాయమా, అయినా ఈ రోజుల్లో ఇద్దరూ ఉద్యోగం చేయకపోతే ఖర్చులు తట్టుకోవడం కష్టం కాదూ?"

ఇన్నేళ్ళు గడిచాక ఇప్పుడీ ఆఫీసులో సుమిత్ర బట్టలు ఇస్త్రీ చేసే మూర్తితో ప్రసాద్ అన్నాడు నవ్వుతూ, " 'మా ఆవిడ ఉద్యోగం చేయదు, ఆవిడే ఇల్లు చక్కబెడుతుంది' అన్న మూర్తి ఇప్పుడిలా చేయడం చూస్తే మూర్తి మారినట్టున్నాడే?"

"సుమిత్ర ఒక్కర్తీ పని చేసుకోలేకపోతోంది," అందువల్ల నేనూ ఓ చేయి వేస్తున్నా. అయినా ఆవిడ సహ ధర్మ చారిణి కదా – అంటే కుటుంబంలో ఇద్దరం సగం సగం పనులు చేసుకుంటూ ఉండొద్దూ?"

"అవునా ఇంకేం పనులు చేస్తూ ఉంటావ్ మూర్తీ ఇంట్లో?"

"లాండ్రీ, అంటే బట్టలు ఉతకడం, కూరలు తరగడం లాంటివీ, సుమిత్ర చదువుకుంటూంటే ఆ రోజుకి అన్నీ నేనే చేస్తా."

ప్రసాద్ నవ్వి ఊరుకున్నాడు.

సినిమా అయ్యేక సుమిత్రని ఇంట్లో దింపేసి ప్రసాద్ ని ఎయిర్ పోర్ట్ కి తీసుకెళ్ళాడు మూర్తి. దారిలో మూర్తి అడిగేడు ప్రసాద్ పెళ్ళి ఎప్పుడు చేసుకోబోతున్నడో అనే విషయాలు.

"చూద్దాం లెండి తర్వాత. ఆ వచ్చేది సహ ధర్మచారిణో సగ ధర్మచారిణో ఏంటో అర్థం కావట్లే ఇంకా,"

"అదేమిటి?"

"చూస్తూనే ఉన్నాం కదా? పెళ్ళి అవ్వనంతవరకూ సహధర్మచారిణికోసం వెదుకులాట. తర్వాత ఆవిడని ప్రసన్నంగా ఉంచడానికి మన పనీ ఆవిడ పనీ కూడా చేయాలి..."

"ఇంట్లో పని ఇద్దరూ కలిసి చేసుకోపోతే ఎలా?"

"మూర్తిగారూ, బయటపని మీకెలాగా తప్పదు కదా, మరి ఉద్యోగం కూడా చేయని సహధర్మచారిణి గారు ఇంట్లో పని కూడా చేయరా? మరేం ఇంకేం చేస్తారో. అయినా మనందరం పెళ్లవనంతవరకూ ఒక మాట, అయ్యాక మరో మాటా కాబోలు ఏం చేస్తాం?"

మూర్తి ఓ వెర్రి నవ్వు నవ్వేడు ఏం చెప్పాలో తెలియక. ఎయిర్ పోర్ట్ లో దిగాక వెళ్తానన్నట్టూ చేయి ఊపాడు ప్రసాద్. మిత్రుడికో హగ్ ఇచ్చి అన్నాడు మూర్తి, "స్టూడెంట్ జీవితం వేరూ, పెళ్ళయ్యాక గృహస్తు జీవితం వేరూ. మనం అమెరికన్స్ లాగా కొంతకాలం కలిసి ఉండడం, ఇష్టం లేకపోతే వెంటనే నీ దారి నువ్వు చూసుకో అనడం చేయలేం కదా, అందువల్ల మనకీ ఎడ్జస్ట్ మెంట్ తప్పదనుకుంటా..."

"అర్ధంమైంది లెండి. డోంట్ వర్రీ. మీ జీవితం మీ ఇష్టం వచ్చినట్టూ జీవించవచ్చు. మీకు వచ్చే ఆవిడ సహ ధర్మచారిణా, సగ ధర్మచారిణా అనేది మీరూ మీరూ నిర్ణయించుకోవాలి. మధ్యలో బయటవాళ్లకి సమాధానం చెప్పుకోవడం ఎందుకూ? మీరెలా ఉన్నా ఆ జీవితం మీది, నాకు అర్ధమయ్యేలా చెప్పడం కూడా అనవసరం కదా? ఇలా అన్నానని ఏమీ అనుకోకండి కానీ మీ ఇంట్లో విషయాలు మీకు మీరు సమర్ధించుకోవడానిక్కూడా ఎవరికీ చెప్పక్కర్లేదు. దీన్నే మనం ఒకప్పుడు స్టూడెంట్స్ గా ఉన్నప్పుడు అనుకున్నాం, పెళ్లయ్యాక ఆవిడ ఆడించినట్టూ ఆడడమే అంటూ. గుర్తుందా? రేప్పొద్దున్న నాకు పెళ్ళయ్యాక నేను కూడా ఇలాగే అవ్వొచ్చు కూడా."

మొహం ఎటో పెట్టి గుర్తుందన్నట్టూ బుర్ర ఆడించాక, చెప్పేడు, "మరి వెళ్తా లేట్ అవుతోంది మీకు కూడా," మూర్తి కదిలేడు. మూర్తి కారు కదుల్తుంటే అది కనిపించినంత మేరకి చేయి ఊపి ఎయిర్ పోర్ట్ లోకి నడిచేడు ప్రసాద్.

**నీతిః సహధర్మచారిణి అంటే "కొన్ని" విషయాల్లో సగం ధర్మం మాత్రమే చేసేది. మిగతా విషయాల్లో ఎవరి ధర్మం వారిదే. లేకపోతే మొగుడిదే మొత్తం ధర్మం; ఆవిడ పని ఆర్డర్ వరకే, తర్వాత నిమిత్తమాత్రురాలు.**

Post your comments